



గాఢ తిమిర పరీవ్యాప్తమైన ఆ రాత్రి రామయ్యగారు ఎక్కడికో నడిచారు. భయంకరంగా ధ్వనించే కీచురాళ్ళూ, అప్పుడప్పుడు కాళ్ళక్రిందపడి నలిగిపోయే చిరుకప్పలూ అవేమీ ఆయన్ని క్షణంసేపైనా నిరోధించలేకపోతున్నాయి.

"తను వెళుతోన్నది ఎక్కడికి?" నిద్రలోంచి బయటికివచ్చి తనను తాను ప్రశ్నించుకున్నారు ఒక్కసారి. ఎక్కడికి?

ప్రకృతి తనని ఆదేశించి నడిపిస్తోంది. ప్రకృతి ఆదేశాలు అసంకల్పిత ప్రతీకార చర్యలకు మల్లే జరిగిపోతూ వుంటాయి. మానవుడు కేవలం ఏదో అజ్ఞాతంగా వున్న అతీతశక్తికి లొంగిపోయి నిమిత్తమాత్రంగా నడిచే కీలుబొమ్మ మాత్రమేనా? రామయ్యగారికి నవ్వువచ్చింది. తన జీవితానికి ఉద్దేశమేవిటి? అసలు "అదంటూ ఒకటి" వుందా? ప్రపంచంలో అదంతా రూపకం! ఉన్నదనుకొని బ్రతకడం-ఆత్మవంచన కాదూ? కాని ఎందుకింత కాలంనుంచీ ఇంత ఉద్దేశరహితంగా సృష్టి సాగుతోంది. ఏదో ఒకటి వుండి వుండాలి!

"అయితే నా వుద్దేశమేవిటి?" మళ్ళా వెంటనే ప్రశ్న వేసుకున్నారు రామయ్యగారు. "నీ జీవితానికి ఉద్దేశమేవిటి?" అంటూ వెకిలిగా నవ్వింది ఆత్మ. నిజమే, తనకు ఏనాడూ నిర్దిష్టమైన ఆదర్శం లేదు. ఇప్పుడూ లేదు! ఇకముందుగూడా ఉంటుందనుకోడానికి ఆధారాలేమీ లేవు.

కథానిక

తల వంచుకొని నడక సాగించారు. గుడ్లగూబ ఒళ్ళు గుర్రోవడి చేట్లు అరిచింది. గుడ్లగూబను పగటిపూట కాకులు ఎందుకలా పొడుస్తాయి? పగలు కనిపించదనే దౌర్బల్యాన్ని ఆసరాగా తీసుకుని అది తమ నేమీ చెయ్యలేదనే ధైర్యంతో పొడుస్తాయి. ఇప్పుడైతేనా!

రామయ్యగారికి సంఘాన్ని ఈడ్చి డొక్కలో న్నుదా మనిపించింది. ఈ సంఘనియమాల్ని తయారుచేసిన పెద్దమనుషుల్ని గొంతు నులుముదామనిపించింది. పగలు అంధకారణీయైన గుడ్లగూబను బాధించే కాకుల్లాగా సంఘం బలహీనులమీద ఒంటికాలుపై యుద్ధానికి వస్తుంది. స్తోమతుగల వ్యక్తుల పరిసరాలకీ సంఘం వెళ్ళదు. అకసినంతా చాటుగా మాటుగా వేళ్ళు విరుచుకొని తీర్చుకుంటుంది. అన్యాయం చేసేప్పుడు ప్రమత్తతతో పట్టుబడిపోతే అధఃపాతాళానికి త్రొక్కుతుంది. ఆ చేసే అన్యాయాన్ని పట్టుబడకుండా చేస్తే నెత్తిన పెట్టుకుంటుంది- కేవలం ఆర్థికస్తోమతనే కొలబద్దతో వ్యక్తుల విలువల్ని నిర్ణయించే సంస్థకూ నైతిక విలువలకీ పోలిక ఎక్కడుంటుంది?

దారికి రెండుప్రక్కలా వున్న తుమ్మచెట్ల గుబుర్లోనించి "గీ" ధ్వని భయపెడతోంది. తోంది! రామయ్యగారు దేనిమీదో కాలువేసి ఎగిరి గంతేశారు. బురదకొయ్య ఒక్క ఎగురు యెగిరి ప్రక్కనున్న కాలవలో కెళ్ళి పడింది పిరికిగుండె.

"తిరునగర్"

అల్లంతదూరాన స్టేషన్‌లో కిరసనాయిలుదీపం ఎర్రగా కనిపిస్తోంది. నక్షత్రాల వెలుగు ఏ కాస్తయినా వుంటే దాన్ని రెండువేపులా వున్న తుమ్మచెట్లు మింగివేస్తున్నాయి. రోడ్డు గడిచి పోయింది. రైలుపట్టాల వెంటనే నడిచాడు. సిగ్నల్ దాటి స్టేషన్‌కి చేరాడు. స్టేషన్‌లో అట్టే జనంలేరు. లోపల పాపం ఎవరో పొరుగూరబ్బాయి గాబోలు చలిలో ముడుచుకొని తుండుగుడ్డ కప్పుకు పడుకున్నాడు. స్టేషన్‌మాష్టారు లోపల రగ్గుముసుగుతన్ని ఇంకో లోకంలో వుండి బనాయించే గురక బైటికి వినిపిస్తోంది. స్టేషన్ దాటి రెండు మూడడుగులు ముందుకు వేస్తే ప్రక్కనే చెరువొకటుంది. స్టేషన్‌కి అవతల ప్రక్కనున్న ఇళ్ళ కన్నిటికీ నీళ్ళకి ఆధారం అదొక్కటే. వాడుతున్న చెరువు గనక బాగానే వుంటుంది. చెరువుగట్టెక్కారు రామయ్యగారు. మత్తుగా నిద్రపోతున్న కప్ప లొక్కొక్కటే లేచి ఎగిరి గంతేసి నీళ్ళల్లోకి సర్దుకుని బుడుంగు బుడుంగుమన్నాయి. తూర్పుదిక్కున చంద్రుడు నీరసంగా ఎర్రగా పైకి లేస్తున్నాడు. రామయ్యగారు రేవులోకిదిగి ఝుమ్మున లాగుతూ కాళ్ళను కరుస్తున్న నీళ్ళలో కాళ్ళు కడుక్కొని ఒడ్డుకొచ్చి కూర్చున్నారు.

రామయ్యగారు మళ్ళా ఆలోచనలోపడ్డారు. అసలు తనకెందుకింత ప్రాముఖ్యం, పలుకుబడి ఏర్పడింది? ఇదివరకులేని అభిమానం, బంధుత్వాలూ ఇప్పుడెక్కణ్ణించి వచ్చాయి? ఇదంతా పచ్చిమోసం. తన కూతురు లేచిపోతే వీళ్ళకెందుకింతయిది? మొన్న ఫాక్టరీలో కూలిజేసుకునే నరసయ్య పెళ్ళాం లేచిపోతే ఎవరికి తెలీలేదు. కాని రుక్మిణి లేచిపోయిందనే సరికి ఊరంతా గుప్పుమంది ఎందుకనో? నేనూ నరసయ్యకు మల్లేనే వుంటే? ఊరికి పెద్దతనేనాయెను: కనుక తన సంగతి అందరికీ కావాలి. ఈ పెద్దతనం ఎక్కణ్ణించి వచ్చింది? అంతా డబ్బు! ఊళ్ళో వాళ్ళంతా తన ఎదుట పడి అడగలేక చాటు చాటున ఏడుస్తున్నారు.

“బాబుగారూ! మీరా? ఎవరోనని వచ్చానండి! ఇంత రాత్రప్పుడు.. ...”నసిగాడు వెంకటయ్య వెనకనించి.

“ఏంచెయ్యను వెంకటయ్యా! ఇంటిదగ్గర నిద్ర పట్టదు మరి.”

“ఇట్టా మంచులో కూకుంటే తెల్లారేతలికి జలుబుపట్టుకొత్తదండయ్యా.”

“బ్రతకటం మహా యాతనగా వుంది వెంకటయ్యా!”అన్నారు రామయ్యగారు.

“మీరు అమ్మాయిగార్ని గురించి చానాయికారిస్తుండారయ్యా. ఏంజేస్తేవుంది? అటువంటి బుద్ధి కలగనేకూడదు. కలిగినాక ఇక అంతేనండి” అన్నాడు వెంకటయ్య.

“నాకు అమ్మాయి లేచిపోయిందనికాదు బాధ. అది లేచిపోక ఏంచేస్తుంది? చిన్నతనంలో పెళ్ళిచేశాం. దాని భర్త ముఖమన్నా దానికి గర్తులేదు. చచ్చిపోయింతరవాతగూడా దానికి మొగుడంటే అర్థం తెలీదు. అప్పుడే వెధవముండని ఇంట్లో కూర్చోబెడితే ఏంచేస్తుంది? కాని నాకొకటే బాధగావుంది వెంకటయ్యా! నావంక చూచే ప్రతివాడిలోనూ ఎంత విషముందనుకున్నావు? అయినా నేనొకటడుగుతాను చెప్పు” అన్నారు రామయ్యగారు.

“ఏంటండీ అది బాబూ?”అన్నాడు వినయంగా వెంకటయ్య.

“నా కూతురు లేచిపోతే వీళ్ళకెందుకు?”

“అంతేనండి బాబూ! మాయంటోళ్ల ఇళ్లల్లో ఏంజరిగినా ప్రపంచానికి అవసరంలేదండి. మీయంటికామందుల ఇళ్ళల్లోజరిగితే అందరికీ కావాలండి. కాని దడిచి మీదగ్గిర అనరండి! చాటు చాటుగా అనుకుంటారు. ఈ ఎదవ ప్రపంచం అంతేనండి బాబూ! మడుసుల్లో నిలువెల్లా ఇసమేనండి. మీరు ఇంకా ఇదవ మాకండి బాబూ! ఏం లాభం? ధైర్యంగా వుండాలండి. ఎవరో అనుకుంటారని మనం దడిస్తే మరి కాస్త దడిపిస్తారండి. లేవండి బాబూ పోదాం, నేనూవత్తా” అన్నాడా వెంకటయ్య యజమాని మీదవున్న విశ్వాసంతో.

“పోతాలే వెంకటయ్యా! చలిలో అంతదూరం నువ్వేమొస్తావు? నే వెళతాలే.” అన్నారు రామయ్యగారు.

“ఫరవాలేదు లెండి”అన్నాడు వెంకటయ్య.

స్టేషన్‌లో అలజడి వినిపించిండి.

స్టేషన్ మాష్టరు లేచాడుగాబోలు ఇంకా ఎవర్నో నిద్రలేపుతున్నాడు. కొంచెం సేపటికి రెక్కవంచబడింది. పచ్చదీపం వెలుగుతోంది.

"అబ్బ! చాలా టైమయిందండీ బాబుగారూ! ఇట్టా రాత్రిళ్లు మేలుకుంటే మీ శరీరం ఆరోగ్య చెడిపొద్దండి. తెల్లారిజాం బండిగూడా వత్తా వుంది. లెండిబాబూ!" అన్నాడు వెంకటయ్య.

బండిగంట మ్రోగింది. రామయ్యగారు లేచి నిలబడి "నే వెళతాలే వెంకటయ్యా! నువ్వెళ్లు చలిలో అంతదూరం నావెంటెందుకు?" అన్నారు.

"ఇంకెక్కడా ఆగమాకండి బాబూ. అట్టే అమ్మాయిగార్ని గురించి యిచారించకండి. ఏం లాభంలేదు. గుండె ధైర్యముండాల. నేనొస్తా బాబుగారూ!" అంటూ వెంకటయ్య గుడిసెవేపు నడిచాడు. వెంకటయ్య జీవితాన్ని వడపోసిన మనిషి. లోకం తీరు—అది కప్పుగున్న ముసుగు అన్నీ అతనికి తెలుసు.

రామయ్యగారు స్టేషన్ ప్లాట్ ఫారం మీదికి నడిచారు. బండిలైటు ఎక్కడో దూరాన దీపం లాగా కనిపిస్తోంది. బండికివెళ్ళేవాళ్లు ముగ్గురో నలుగురో వున్నారు. వాళ్ళయినా పాలూ, పెరుగూ పట్నంలో అమ్ముకొనేవాళ్ళు.

"ఏవండీ! రామారాపురం ఇక్కడికెంత దూరంవుంది?" అని అడిగాడు ఓ కుర్రాడు. బక్క పలచగానూ, కాస్త పొడుగ్గానూ వుంటాడు. అంతరాత్రి సహితం అతని పచ్చటి శరీరచ్ఛాయను దాయలేక పోతోంది. జుట్టు చెదిరిపోయి నుదుటి మీద పడి తుమ్మెదలు ముసురుతున్నట్లుగా వున్నాయి.

"ఏఁ ఎందుకు?" అన్నారు రామయ్యగారు. ఆ అబ్బాయి ముఖంలోకి చూస్తూ.

"రామయ్యగారని - ఆ వూర్లో వున్నార్లే. ఆయనదగ్గరకెళ్ళాలి" అన్నాడు కుర్రాడు.

"ఏం పని?" అన్నారు రామయ్యగారు. ఒక వేళ ఆ మనిషి తనకూతురి కబురు ఏమైనా పట్టుకొచ్చాడేమోనని.

"వారితో కాస్త పని వుందండి. రాత్రి పది గంటలబండికే వచ్చాను. కానీ అంతరాత్రి చీకట్లో వెళ్ళలేక ఇక్కడే పడుకున్నాను తెల్లవారుఝామున వెళ్ళవచ్చని. వారితో నాకు కావలసిన సహాయం కొంత వుందండి. మీదీ ఆ వూరేనా?" అన్నాడు కుర్రాడు.

"ఆఁ ఆఁ మాదీ ఆ వూరేలే. ఆయనతో అంత ముఖ్యమైన పనేవిటో" అన్నాడు కుర్రాడు సమాధానం చెపుతాడో లేదోనని సందేహిస్తూ.

"అది పెద్ద రహస్యమేమీ గాదండి! నేను కాలేజీలో బి. ఏ. చదువుతున్నానండి. ఒక సంవత్సరం అయిపోయింది. ఇది రెండో ఏడు. కాని డబ్బులేదు. ఇంతవరకూ మా అమ్మ కష్టపడి చెప్పించిందండి. నిరుడు రామయ్యగారెవరో బీద విద్యార్థిని చదివించారట. మా లెక్చరరుగారు చెపితే నాకూ ఏమైనా సహాయంచేస్తారేమోనని ఆశ" అన్నాడు కుర్రాడు.

తన ప్రతిభ అంతగా పాకిపోయినందుకు రామయ్యగారు మనసులో ఆనందపడ్డారు. తన డబ్బు అంతగా సార్థక్యంపొందుతున్నందుకు గర్వించారు.

"మీది ఏ వూరన్నావు?"

తను ప్రస్తుతం వుంటున్న వూరు పేరు చెప్పాడు ఆ అబ్బాయి.

"అలాగా మరి అంతదూరంనించి వచ్చావు గదా! ఆయన నీకు సహాయం తప్పకుండా చేస్తాడని గ్యారంటీ ఏమిటీ?" అన్నారు రామయ్యగారు.

రైలు మరీ దగ్గరగా వచ్చేసింది. రైలు మోతలో రామయ్యగారి మాటలు కుర్రాడికి సరిగా వినిపించలేదు. "ఏమిటండీ?" అన్నాడు మళ్ళా చెప్పమని. ఈసారి ప్రశ్న మార్చేశారు రామయ్యగారు. తన ప్రశ్న తనకే అవమానంగా తోచింది. నిజానికి రామయ్యగారిది పొగడ్తలకు ఉబ్బి తబ్బిబ్బయ్యే ప్రకృతిగాదు. కాని కేవలం తనంతట తానులేచి తక్కువతనాన్ని ప్రకర్ష చేయడం ఆయనకు నచ్చదు.

"ఏం లేదులే!" రామయ్యగారు సమర్థించి ఆగిపోయిన రైలుపెట్టెలవేపు దృష్టి సారించారు.

"రామాపురం నేనూ వస్తాను ఇద్దరం కలిసే వెళదాం. ఓసారి బండి చూచివద్దాం రా!" అన్నారు. కుర్రాడు వెంట నడిచాడు. రామయ్యగారి రైలు ఆ చివరినుంచి ఈ చివరివరకూ తిరిగారు. ఆయనకి ఏ బండిలోనైనా తన కూతురు కనిపిస్తుందేమోనని ఆశ! రామయ్యగారు ప్రతీ

పెట్టెనూ పరిశీలించడం చూచి "ఎవరేనా రావాలాండి ఈ బండికి?" అన్నాడు కుర్రాడు.

"ఆఁ ఆ! మా అమ్మాయే! మా పెద్దమ్మాయి రావాలి!" అంటూ గబగబా ముందుకు నడిచారు.

బండి బయలుదేరి మరో స్టేషన్ వేపు పరుగెత్తింది. పట్టా దాటిన ఇద్దరూ రోడ్డున పడ్డారు.

వెంటవున్న కుర్రాడు నిశ్శబ్దాన్ని భరించలేకనో ఏమో "రామయ్యగారు మంచి ఉదారులా అండి?"అని అడిగాడు.

"ఏమో! ఆ విషయం నాకూ అట్టే తెలీదు. నువ్వేమనుకొని వచ్చావు?" అన్నారు.

"ఎంత నమ్మకం లేకపోతే ఇట్లా బండెక్కి ఇంతదూరం వస్తానండి! చాలా మంచివారని చెప్పారు"అన్నాడు.

ఆనంద పారవశ్యంలో హృదయం ఉప్పొంగింది. ప్రత్యక్షంగా ఫలానా అని తెలిసి భట్రాజు పొగడ్తలు పొగిడితే తనకు వళ్లుమంట. కాని ఈ కుర్రాడి మాటలన్నీ తను ఫలానా అని తెలియకుండా చెపుతున్న నిజాలు. కాని రామయ్యగారు తనభావాలను ముఖంలో ప్రతిఫలింపచెయ్యకుండా వుంచడం అలవాటుచేసుకున్నారు.

"ఇంతవరకూ ఎవరి సహాయమూ లేకుండా ఎలా చదివావు?" అన్నారు

కుర్రాడు చాలా నమ్రతతో జవాబు చెపుతున్నాడు. "మా అమ్మ ఆ పనీ ఈ పనీ చేసి చదివించిందండి. నాకు ప్రపంచంలో మిగిలింది ఆమె ఒకర్తేనండి. ఆమె రెండు నెలలక్రితమే చనిపోయిందండి..." కుర్రాడి కంఠం రుద్ధమైపోయింది.

"ఆమె నాగురించి ఎంత బాధపడేదో-అసలు నేను అదృష్టవంతుణ్ణే అయితే ఆమెకసలు అటువంటి కష్టాలు వచ్చేవిగాదండి!..."కుర్రాడిలో అమ్మమీద వున్న సానుభూతి అంతా ఒక్కచోటికి చేరి ఉప్పెనలా బైటికివస్తోంది.

"ఆమె పుట్టిన పుట్టుకకు అంత హీనంగా బ్రతకవలసింది గాదండి. అదృష్టహీనుణ్ణి. నేను పుట్టిం తరువాతే!"

"ఏఁ"అన్నారు రామయ్యగారు.

"మా నాన్నకు తాతగారు చాలా ఆస్తి ఇచ్చిపోయాడటండి. మా నాన్న పొలమంతా అమ్మేసి పట్నంలో వజ్రాల వర్తకం చేసేవారట. బాగా డబ్బు గడించారట" కొంచెంసేపు నిశ్శబ్దంగా వూరుకున్నాడు కుర్రాడు చెప్పడం మానేసి.

"ఊఁ...ఊ..."ఆత్రంగా అడిగారు ముందు నడుస్తున్న రామయ్యగారు.

"అప్పటికి నేను మా అమ్మ కడుపున వున్నానటండి. ఓ రోజున మా నాన్న చాలా డబ్బు తీసుకొని బొంబాయి వెళ్ళారటండి."

ఈసారి చెప్పమని రామయ్యగారు ఆత్రంగా అడగలేదు. రెండడుగులు ముందు వుండి వింటూ వూరుకున్నాడు.

"వస్తానని చెప్పిన రోజుకు ఆయన రాలేదండి కాని...రెండో రోజున సముద్రం వొడ్డున..." ఏదో చెప్పబోయాడు. కాని రామయ్యగారు గబగబా నడిచారు. ఆయనను కలుసుకోడానికి కాస్త వేగం హెచ్చించాడు కుర్రాడు.

ఎక్కడో దూరంగా చెట్లమీదినుంచి కాకులు అరుస్తున్నాయి. వూళ్ళోంచి తనకోసమే గాబోలు కొడుకూ-ఇంకా కొంతమందీ వస్తున్నారు.

"ఏమిటి నాన్నా. అర్థరాత్రి ఇంట్లోంచి లేచి చెప్పకుండా వెళ్లిపోతే ఇంటిల్లిపాదీ ఎంత ఖంగారు పడతారో ఆలోచించనవసరం లే?" అన్నాడు కొడుకు. వెంటవున్న కుర్రాడు రామయ్యగారు ఆయనేనని తెలుసుకొని తెల్లముఖం వేశాడు. తనకిచ్చిన గదిలో కూర్చుని ఆ రోజల్లా ఒకటే ఆశ్చర్యపడ్డాడు.

* * *

కిటికీలోంచి వులివెచ్చని బాలభానుని కిరణాలు దుప్పటి లోపలికి దూరి చక్కిలిగింతలు పెట్టాయి. తనప్రక్కన దస్తావేజులుండడం చూచి కుర్రాడు అదిరిపడ్డాడు. దాంట్లో ఓ ఉత్తరం గూడా వుంది—తనని ఉద్దేశించి రాసిందే.

రామారావుకి,

"బాబూ, ఈ ఉత్తరం నీకందజేసినా కొంత మనశ్శాంతి పొందుదామని ఆశ, నువ్వు నన్ను క్షమించలేవని నాకూ తెలుసు. నీ ముఖం చూచి చేతులు జోడించి క్షమించమని అడక్కుండా వుండలేకపోతున్నాను. దానికి కారణం నీలో మీ నాన్న పోలికలు చాలా ఉండడమే."

రామారావుకి విస్మయం కలిగింది.

"సంఘం కప్పిన ముసుగును తీసిపారేసి యథాతథంగా నీకు రహస్యం చెప్పేస్తాను. అప్పటికయినా ఈ జీవితానికి శాంతి చేకూరుతుందేమో"

"నువ్వెవరైతే సహాయం అర్థించావో అతను ఎవరని నీ వుద్దేశ్యం? అతను నీకు జన్మవిరోధి. నువ్వు దేన్ని సహాయం కోరావో అదంతా నీ హక్కు! నిజంనాయనా, అదంతా నిజానికి నీదే.

ఎవరైనా సరే గొప్పవాడవాలంటే కష్టపడితే లాభంలేదు. చెమటోడ్చి కష్టపడితే నీ తిండికే సరిపోతుందాయె. అన్యాయంచెయ్యందే ప్రయోజకుడైనవాడు అసలుండడేమో అని నా నమ్మకం.

ఈనాడు ఊరిపెద్దగా చెలామణీ అవుతున్న రామయ్య ఎవరో తెలుసా? ఒకనాడు పట్నంలో కూలికి రిక్షాలాగే రామిగాడు.

ఇవంతా నీకు విపరీతంగా కనిపిస్తూ వుంది కదూ? నిజమే విపరీతాన్నే చేశాను. సుఖంగా జీవించటానికి, శాంతిగా బ్రతకడానికీ కేవలం ఐశ్వర్యమే కారణమనుకొని ఆ విపరీతాన్ని చేశాను. కానీ... కానీ... అదంతా వట్టిది. సుఖమూ, శాంతి కేవలం మానసిక ప్రవృత్తినిబట్టి వుంటాయి ఆ విపరీతంవల్ల నేననుకున్న సుఖం, శాంతి పొందలేక పోయాను సరిగదా తీవ్రమైన ఆవేదనకుగూడా గురయ్యాను.

నాకు తలిదండ్రు లెవరోగూడా నాకు తెలీదు. మేనమామమాత్రం గుర్తు. ఆయన, ఆయన భార్య పెట్టిన కష్టాలు ఈనాటివరకూ నే మర్చిపోలేను. ఓ రోజు తెగించి పారిపోయాను. పట్నంచేరుకుని రిక్షాలాగుతూ కాలక్షేపం చేసేవాణ్ణి. రోజులు భారంగా గడిచేవి. ఏ రోజు రిక్షా లాక్కపోతే ఆ రోజు పస్తే.

ఆవాళ డబ్బులు చాలాతక్కువగాదొరికాయి. కడుపులో ఆధారంలేక ఆ చలిలోనే రిక్షాలో ముడుచుకొని పండుకున్నాను. ఎప్పుడు నిద్రపట్టిందో ఎంతసేపు అలాగే నిద్రపోయానో ఎవరోవచ్చి లేపేవరకూ తెలీలేదు. లేచి చూచేసరికిచాలారాత్రయిపోయింది. తెల్లవారవచ్చింది.

"ఏయ్ రిక్షా కడతావా?" అన్నాడతను

"ఎక్కడికండి" అన్నాను నిద్రకళ్లనలుపుతూ.

ఎక్కడికి తీసికెళ్ళాలో. చెప్పాడావ్యక్తి ఆయనదగ్గర ఒక్క సూట్ కేసు తప్ప ఇంకేమీ లేవు. రిక్షాలాగుతూవుంటే ఆయన హుషారుగా నన్ను మాట్లాడిస్తున్నారు. వేషం అదీ చూస్తే డబ్బుబాగానే గిట్టేట్టున్నాయి!

"మీరేంజేస్తుంటారండీ" అని అడిగాను.

ఆయన తను వజ్రాల వ్యాపారం చేస్తున్నాననీ...తనిప్పుడా వ్యాపారంమీదనే బొంబాయి వెళ్ళి వస్తున్నాననీ - చాలా లాభం వచ్చిందనీ చెప్పాడు. అందుకే కాబోలు అంత హుషారుగా వున్నాడు. పెట్టినిండా వజ్రాలుంటాయన్న మాట!

"అవన్నీ నాకుంటే?" ఈ ఆలోచన అసలెందుకు తోచిందో నాకర్థంగాలేదు. దానికి సమాధానం చెప్పుకోలేక సతమత మయ్యాను. నాకళ్ళముందు లాటరీలో లక్షలు వచ్చినవాళ్ళూ, దొంగవ్యాపారంచేసి కోటీశ్వరులైన వాళ్ళూ, రేసుల్లో మహారాజులైనవారూ జ్ఞాపకంవచ్చారు. అంతలో కడుపులో ఏమూలనుంచో ప్రేగు అరిచింది.

"వాళ్ళంతా న్యాయంగా సంపాదించినవాళ్ళేనా? కష్టపడి చెమటోడ్చి ఎంతకాలానికి సంపాదిస్తావు! చేస్తేనేం? ఒక్క అన్యాయం- నీ జీవితం దివ్యంగా వెళ్ళిపోతుంది - ఆఁ - ఒక్క అన్యాయం...ఒక్క అన్యాయం. అంటోంది మనసు.

నన్ను నేను గుర్తుతెచ్చుకొనేసరికి రిక్షా బీచి ఒడ్డున రోడ్డుమీదనుంచి వెళుతోంది. సముద్రపు ఘోష వినిపిస్తూనేవుంది. రిక్షాలో పాపం ప్రయాణపు బడలికతో గాబోలు అలిసిపోయి కునికిపాట్లు పడుతున్నాడాయన.

నాకాశక్తి ఎక్కణ్ణించి వచ్చిందో తెలీదు. ఏకాంతంలో, ఎవరూ చూడరనే ధైర్యముంటే మానవత్వంలో మరుగుపడిపోయిన రాక్షసత్వం ప్రకోపిస్తుంది గాబోలు! రిక్షా గభాల్న అటువైపు తిప్పాను ఆయనకు పూర్తిగా మెలకువరాలేదు. రిక్షా చాలాదూరం తీసికెళ్లి ఆపాను. ఆ కుదుపుతో ఆయన ఉలికిపడి లేచి ఖంగారుపడి "రిక్షా ఇక్కడికి తీసుకొచ్చావేం?" అన్నారు. నేను వెకిలిగా నవ్వాను. పాపం ఆ సమయంలో ఆయన ముఖం...

పారిపోడానికి ప్రయత్నం చేస్తున్నారు. రిక్షాలో దేనికైనా ఉపయోగపడుతుందని దాచిన బండ చాకు బయటికి తీశాను. ఆయన పరిగెత్తాడు. కానీ ఇసుకలో ఎక్కువదూరం పరిగెత్తలేక పోయాడు. వెంటబడి పట్టుకొని ఆ బండకత్తితోనే గుండెల్లో పొడిచాను. ఆయన ఖంగార్లో గభాల్న క్రిందబడ్డారు. గొంతుపిసికాను. అంతే! అయిపోయింది - అంతా అయిపోయింది! చేతులకు రక్తం అంటుకుంది. సముద్రంలో కడుక్కొని ఆ పెట్టె గుడిశెలో దాచి రిక్షా తీసుకుపోయి దాని యజమానికిచ్చేసి ఆ తెల్లవారుఝామునే బండెక్కాను. ఆ కేసులో వజ్రాలే వున్నాయి- అదీ ఈ ఆస్థంతా! నీకు సహాయం చెయ్యడానికి ... చేసినా మిగిలింది మాత్రం ఇది.

వెళ్లిపోయేటప్పుడు ఒక్కటిమాత్రం చెప్తున్నాను బాబూ! సంఘాన్ని ఎప్పుడూ నమ్మకు, పయోముఖ విషకుంభం! చేతనైతే దాన్ని నీ ఇష్టం వచ్చినట్లు ఆడించు-అంతే! పాపం అంటే నాకు నమ్మకంలేదు. కాని మానసిక వ్యధనించి తప్పించుకోలేక నీ సొత్తు నీకప్పగించి తేలికపడతాను—వుంటాను. రామయ్య-”

రామారావు వుత్తరం పూర్తిచేసి సర్పదష్టుడైనట్లు గభాల్న మంచందిగి తలుపులుతీసి “మహానుభావా! నాకింతటి దయాభిక్షా!” అంటూ ద్వారం వేపు చూచాడు. కాని అప్పటికే ఇంటి యజమాని ఇల్లుఖాళీ చేసి వెళ్ళిపోయాడు.

---

కథానిక

# డ్యూటీలో వీరాస్వామి

కాజ వెంకటశ్రీనివాసరావు

పోలీసు వీరాస్వామి టోపీ చేతులోకి తీసుకుని తన 375 నెంబరు తుడిచి తిరిగి తలమీద పెట్టుకున్నాడు. లాఠీని కుడిచేతిలోకి తీసుకున్నాడు. ఒడ్డూ పొడుగూ అజానుబాహువుగా ఉన్న శరీరానికి డ్రస్ సరిగా అమరిందో లేదో చూసుకుని సరి చేసుకున్నాడు. ఎదురుగా ఉన్న క్లాక్ టవర్ చూశాడు. టైం ఆరూ నలభై అయిదు అయింది. రాత్రి మూడుగంటలు దాకా ఉంది డ్యూటీ. డ్యూటీ... డ్యూటీ... ఏంలాభం? రాత్రంతా కళ్లు కాయలుకాచేలా, కాళ్ళు అరిగేలా, ఒళ్ళు హూనం అయేలా తిరిగి బీటుకాస్తే, ఒక్క దొంగ అయినా దొరికితేనా! ఎలా దొరుకుతారు? ఈ మధ్య దొంగతనాలే తక్కువ అయాయి. అందులోనూ తనకి నెల రోజులనుండీ ఒక్క కేసయినా దొరకటంలేదు. కాని ఎస్. ఐ. ఊరుకుంటాడా? మరీ మండిపడుతున్నాడు ఒక్కకేసయినా పట్టుకోటంలేదని. ఉంటేగా పట్టుకోటానికి? ఏమయినా సరే పట్టుకోవాలంటాడు ఎస్. ఐ. తనకేం హాయిగా పడుకుని...ఒక రాత్రి అంతా బీటు వెయ్యమను తెలుస్తుంది!

ఇంతకీ ఎస్.ఐ.ని అంటే ఏం లాభం? అనాల్సింది ఆ వెంకటేశంగాడిని. ఓ కానిస్టేబుల్ అయాడుకదా అని, పది ఏళ్ళనుండీ పనిచేస్తున్నా తనకి ప్రమోషన్ లేకపోగా, తన కళ్ళముందే చేరిన వెంకటేశంగాడు కానిస్టేబుల్ అయి కూర్చున్నాడు. అందుకే వాడికి అంత గర్వం. తనంటే అంత చులకనానూ. అడుగులకి మడుగులొత్తుతూ, ఏ ఎండకాగొడుగు పట్టి ఎస్.ఐ.ని లొంగదీసుకున్నాడు.

వెంకటేశంగాడు పోలీసు కానిస్టేబుల్ అని పేరేగాని నిజంగా వాడో దొంగ వెధవ. రిక్షా వాళ్లదగ్గర పావలా, బేడా లాగటంకూడా ఓ బ్రతుకేనా? పాపం! వాళ్ళు కష్టపడి రిక్షాలు లాగిలాగి ఓపావలో అర్ధో సంపాదిస్తే దానిలోసగం లాగుతాడు. మళ్ళీ జట్కావాళ్ళదగ్గర లాగటానికి దమ్ములేవు!

పల్లెటూళ్ళనుండి పనిమీద ఇద్దరు ముగ్గురు